విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 17, జూలై 2023

ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జా

విశాలాంధ్ర - చాగలమర్రి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వము స్థలాలను కొనుగోలు చేసి సర్వ శిక్ష అభియాన్ పథకం ద్వారా పాఠశాలల నిర్మించి పేద విద్యార్థులకు విద్యను అందించేందుకు తరగతి గదులను నిర్మించారు. పాఠశాలల నిర్మాణం అనంతరం మిగిలిన ఖాళీ స్థలమును విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలముగా కొంత స్థలాన్ని వదిలివేయడం జరిగింది. ఈ స్థలమును గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసి ఏకంగా గ్రామ సచివాలయ వార్డు వాలంటీర్ కు అమ్మిన వైనం పెద్ద వంగలి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు 2004 సంవత్సరంలో ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల ప్రతాపరెడ్డి ఎన్నిక అయిన తర్వాత 2006వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.8 లక్షల నిధులతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల కోసం అదనపు గదులను నిర్మించడం జరిగింది. ప్రాథమికోన్నత పాఠశాల కోసం అప్పట్లో విద్యాశాఖ అనుమతితో స్థలమును కొనుగోలు చేసి తరగతి గదులను నిర్మాణం చేపట్టడం జరిగింది.

ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాల గా మారడంతో గదులు నిర్మాణం విద్యార్థులకు సరిపోకపోవడం వల్ల గ్రామంలోని వేరే ప్రాంతం కు స్కూలును ఏర్పాటు చేయడం జరిగింది. నిరుపయోగంగా ఉన్న తరగతి గదులను అంగన్వాడి కేంద్రం ఒకటి, ఇప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం కు ఒక గదిని ఇవ్వడం జరిగింది. మిగిలిన ఖాళీ స్థలంలో రైతు భరోసా కేంద్రం కు అనుసంధానంగా పశువులకు చికిత్స నిమిత్తం పశువుల చికిత్స (బోను) ను ఏర్పాటు చేయడం జరిగింది.అయితే కొందరు వ్యక్తులు ఈ స్థలమును స్కూల్ కోసం ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయించలేదని మిగిలిన స్థలం మాకు హక్కు ఉన్నందున ఖాళీ స్థలమును అమ్మినారని గ్రామస్తులు తెలిపారు. ఖాళీ స్థలంను కొనుగోలు చేసిన గ్రామ సచివాలయ వాలంటీర్ స్థలమును చుట్టూ నిలువు బండలు పాతి రేకుల షెడ్డు వేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రభుత్వము పాఠశాలల కోసం అప్పట్లో కొనుగోలు చేసిందని మిగిలిన స్థలము ఎలా కబ్జా చేసి అమ్ముతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కబ్జా చేసిన స్థలమును ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు ఆ స్థలాన్ని వినియోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు నోరు మెదపకపోవడం కోసం మెరుపు.

శివవరంలో దాహం దాహం...!

విశాలాంధ్ర - అవుకు : శివవరం గ్రామంలో గత వారం రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తుల పేర్కొంటున్నారు. గ్రామంలోని వాటర్ ఫిల్టర్ కు ఉన్న మోటర్ కాలిపోవడంతో నీటి సమస్య మొదలైందని పేర్కొంటున్నారు. కాలిపోయిన మోటార్ స్థానంలో కొత్త మోటర్ బిగించకపోవడం ఓ హెచ్ఎస్ఆర్ ట్యాంకు సంబంధించిన మోటర్ కూడా కాలిపోవడంతో నీటి సమస్య తీవ్రమైందని తాగడానికి కూడా నీరు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలోని పశువులకు కూడా నీటి కొరత ఏర్పడిందని దూరంగా ఉన్న కాలువ దగ్గర నుండి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. వారం రోజులుగా తగులు రాకపోవడంతో పనులు మానుకొని నీటి కోసం దూర ప్రాంతానికి వెళ్లాల్సి పరిస్థితి ఏర్పడిందని మహిళలు పేర్కొంటున్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్తులు ముక్తకంఠంతో అధికారులను కోరుకుంటున్నారు

శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా విరజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దేశ నలుమూలల నుండి దర్శించుకుని సేవించుకున్నారు పవిత్ర పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వేకువ జాము నుండే అధిక సంఖ్యలో భక్తులు క్యూ లైన్‌లో వేచిఉండి 50వేల కు మందిపైగాభక్తులుస్వామిఅమ్మవార్లనుదర్శించుకున్నారని అంచనా.

2వేల ఎకరాల పంటలకు సాగునీరు ప్రశ్నార్థకం

విశాలాంధ్ర - మిడుతూరు : నందికొట్కూరు నియోజకవర్గం మిడుతూరు మండలంలోని రోల్లపాడు గ్రామ సమీపంలో ఎస్సార్ బీసీ ఆధునికరణ పనుల్లో భాగంగా సిమెంట్ బెడ్, సిమెంట్ లైనింగ్ కాంక్రీట్ పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్న కంపెనీ యాజమాన్యం నత్త నడకన పనులు చేస్తునడంతో చేస్తుండడంతో.రోళ్ళపాడు గ్రామస్తులకు తాగు, సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం గ్రామ సర్పంచ్ రామస్వామి రెడ్డి ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్‌బిసి కెనాల్ వద్ద రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ ఎస్సార్ బీసీ లైనింగ్ పనులను నిర్వహిస్తున్న ఏ కెఆర్ కంపెనీ యాజమాన్యం పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి గ్రామానికి చెందిన రైతులు 2000ఎకరాలలో సాగు చేస్తున్న పంటలకు బోర్ల ద్వారా నీరు అందే పరిస్థితి లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. మూడు వేల జనాభా ఉందని గ్రామానికి సాగునీరు అందించేందుకు పది బోర్లను వేయడం జరిగిందని అయితే లైనింగ్ పనుల కారణంగా బోర్లలో చుక్కనీరు లేకుండా ఎండిపోయాయని దీంతో తాము తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల సాగు, తాగునీటి ఎద్దడి పై జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే ఎస్సార్ బీసీ లైనింగ్ పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆందోళన చేపట్టవలసి వస్తుందని వారు హెచ్చరించారు రైతులు,గ్రామస్తులు రాఘవేంద్ర, శ్యాంపుల్లయ్య,మదన శేఖర్, సంజీ వ రాయుడు, వెంకటేశ్వర గౌడ్, రాయుడు, రమేష్, మైరవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగబెడుతున్న అల్ట్రాటెక్

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పరిశ్రమలు వస్తే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన ప్రజలకు విష వాయువులతో యాజమాన్యం ఊపిరాడ కుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దట్టమైన పొగను గ్రామాలపైకి వదులుతూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. పరిశ్రమ నుం డి వస్తున్నా సిమెంట్ డస్ట్‌తో ఇప్పటికే సతమతమవుతున్న సమీప గ్రామాల ప్రజలు ఇప్పుడు పొగ రూపంలో విషవాయువులు వెలబడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కార్పొరేట్ దాటికి స్థానిక ప్రజల జీవితాలు కక వికలమవుతున్నాయి. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో యాజమాన్యం ఆడిందే ఆటగా సాగుతున్నది. పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన రైతులు ఇప్పటికే అనాధలుగా మారి జీవనోపాధి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. తరాలుగా జీవనోపాధి పొందుతున్న భూములను కోల్పోవడంతో ఇప్పుడు గూడు తప్ప రైతులకు మరేమీ మిగలలేదు. సిమెంట్ పరిశ్రమ సమీప గ్రామాల్లో అక్కడక్కడ కొంత సాగు భూమి ఉన్న పరిశ్రమ నుండి వెలువడుతున్న దుమ్ముధులితో పంటలు పండగ అవి కూడా కార్పొరేట్ రంగానికి అప్పగిస్తున్నారు. అన్నీ వదులుకున్న ఇక్కడి ప్రజలకు స్వచ్ఛమైన గాలి కూడా కాలుష్యం అవుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. అనంతపురం- నంద్యాల జిల్లా సరిహద్దుల్లోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ నుండి వెలబడుతున్న విషవాయువులు దుమ్ము ధూళితో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తుమ్మలపెంట గ్రామ పరిధిలో ఉన్న పరిశ్రమ వలన తుమ్మలపెంట, గోరుమాను పల్లి, బంధార్లపల్లి, అంకిరెడ్డిపల్లి, మదనంతపురం, అనంతపురం జిల్లా తాడపత్రి మండలం భోగసముద్రం, అయ్యవారి పల్లి, తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు దటమైన పొగ మేఘాలతో కూడిన విష వాయువులు వస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.సమీప గ్రామాలలో నీటికాలుష్యం పెరిగినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పరిశ్రమ యాజమాన్యం ఉపాధి ఉద్యోగాలు కల్పించకున్న తమ బతికేదో తాము బతుకుతున్నామని ఆదుకోవలసిన పరిశ్రమ తమకు పొగబెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కండి

విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం జరిగినది. రైతు సంఘం నాయకులు కాసిం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా నాయకులు సురేష్ గార్లు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజురోజుకు వ్యవసాయ సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరిగి పోతున్నాయని, అంతంతమాత్రమే వస్తున్న పంటల దిగుబడితో, అమలు గాని ప్రభుత్వమద్దతు ధరలతో, నకిలీ విత్తనాలు, ఎరువులు, అకాల అధిక వర్షాలతో,కరువు వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం చేసిన అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటు న్నారు. గ్రామ కమిటీ గౌరవాధ్యక్షులుగా కాసిం, అధ్యక్షులుగా మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా నాగ సురేష్, ఉపాధ్యక్షుడిగా నారాయ ణరెడ్డి,సహాయ కార్యదర్శిగా ప్రసాద్ రెడ్డితో పాటు 13మందితో గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

సిద్దేశ్వరం అలుగు నిర్మాణం సంగమేశ్వర ఎత్తిపోతల పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : రాయలసీమకు తల మాణికమైనటువంటి సిద్దేశ్వరం అలుగు నిర్మాణము సంగమేశ్వర ఎత్తిపోతల పనులు వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని పనులు చేపట్టే దిశలో పయనించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలో సీపీఐ కార్యాలయంలో విలేఖల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణ నది జలాలు ప్రజల సాగు త్రాగునీటి కోసం సీపీఐ పార్టీ అనేక ఆందోళనలు ప్రాణ త్యాగాలతో సాధించుకోవడం జరిగిందన్నారు. రాయలసీమకు త్రాగు నీటి సాగునీటిని ఉపయోగించాలని ఉద్దేశంతో సిద్దేశ్వరం అలుగునిర్మాణం చేపట్టాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కారణంగా ఇంతవరకు అలుగు నిర్మాణము చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడం విచారకరమని అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెంబర్ 98 ప్రకారం ఇంటికొక ఉద్యోగం కల్పిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం తూతూ మంత్రంలా కొంతమందికి ఉద్యోగం కల్పించి చేతులు దులుపుకోవడం జరిగిందని సంగమేశ్వరం వద్ద ఎత్తిపోత పథకం ఏర్పాటు చేస్తే కొత్తపల్లి మండలం ని అనేక గ్రామాలలో ని చెరువులకు అనుసంధానం చేస్తే సాగునీరు. తాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టు నిర్మాణాలపై తన తండ్రి బాటలో నడుస్తానని ఆశతో ప్రజలు ఎన్నుకుంటే ఆయన ఆశలను నిరాశపరుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే సిద్దేశ్వర నిర్మాణము సంగమేశ్వర ఎత్తిపోతల పనులు వెంటనే చేపట్టి రాయలసీమ వాసులకు ఈ ప్రాంత ప్రజలకు త్రాగునీరు సాగునీరు అందే ప్రయోజనం ఉంటుందని రానున్న కాలంలో ఈ సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో పరిష్కార దిశలో చేపట్టేందుకు ఆందోళన ద్వారా సన్నద్ధమవుతున్నామని తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్.బాబాపకృద్దీన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, ఆత్మ కూరు సీపీఐతాలూకాకార్యదర్శి కె.శ్రీనివాసులు, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకటశివుడు,పాములపాడుమండలసహాయకార్యదర్శిప్రతాప్ పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలకు వైసీపీలో గౌరవం లేదు

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రతిపక్ష పార్టీలను విమర్శించే ముందు సొంత పార్టీ దళిత ఎమ్మెల్యేను గౌరవించడం నేర్చుకోవాలని రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గిత్త జయసూర్య అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన రాష్ట్ర మంత్రి రోజా పర్యటనలో భాగంగా శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రతిపక్ష పార్టీలకు జాకీలు పెట్టి లేపిన లేవడం లేదనడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష పార్టీలను విమర్శించే ముందు సొంత పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యేను గౌరవించడం నేర్చుకో అని హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధి పై మాట్లాడే సిద్ధార్థ రెడ్డినీ సొంత గ్రామమైన ముచ్చుమరి పక్కలోనే రూ.360 కోట్లతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి సాగు నీరు అందించిన ఘనత టిడిపి దే అని గుర్తించుకోవాలన్నారు. నియోజకవర్గంలో రైతులకు సాగు తాగునీరు మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంపులతో కేసి కాలువకు నీటిని అందించిన ఘనత మాంద్ర శివానందరెడ్డి కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలైన వీపనగండ్ల ,ముచ్చుమర్రి,సుంకేసుల, జలకనూరు, నెహ్రూ నగర్, పాతకోట, పగిడ్యాల తదితర గ్రామాలకు కృష్ణపుష్కరాల సందర్భంగా వేసిన బిటి రోడ్లు కనబడడం లేదా అని ప్రశ్నించారు.ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల క్రింద నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్, ఏబీఎం పాలెం, సిఎస్ఐ పాలెం లో వాడవాడలా చంద్రన్న బాట పథకం కిందవేసిన సీసీ రోడ్లే టిడిపి చేసిన అభివృద్ధికి నిదర్శనం అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఏ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో శాప్ చైర్మన్ గా ఉన్న మీరు కేవలం రెండు ఇండోర్ స్టేడియలు సాధించడంతో అభివృద్ధి అనుకుంటే పొరపాటు అన్నారు.నందికొట్కూరు నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ అయిన 2009, 2014ఎన్నికల్లో కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసిన లబ్బి వెంకటస్వామి, వై.ఐజయ్యలను గెలిపించి వారి అధికారాలను వారే అనుభవించే విధంగా సహకరించిన ఘనత గౌరు, మాండ్రలకే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న ఐజయ్యను గత సీఎం చంద్రబాబు నియోజకవర్గంలో పాల్గొనే ప్రతి అభివృద్ధి బహిరంగ సభలకు గౌరవంగా ఆహ్వానించడం జరిగిందన్నారు. వైసీపీ పార్టీలో అత్యధిక మెజార్టీతో గెలిచిన మీ ఎమ్మెల్యే ఆర్థర్ ను ఇప్పటికీ రెండుసార్లు మంత్రులు పాల్గొన్న ప్రారంభోత్సవాలకు ఆహ్వానించకపోవడం ఎంతవరకు సమంజసమో మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఏ పార్టీకి జాకీలు పెట్టి లేపవలసిన అవసరం వచ్చిందో ఇటీవల జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇచ్చారో గుర్తు పెట్టుకోవాలన్నారు. నియోజకవర్గంలో వైసీపీ పార్టీకి జాకీలు పెట్టేందుకు అప్పట్లో ఇన్చార్జ్ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను, ప్రస్తుత మంత్రి రోజాను తీసుకొని వచ్చి లేపవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందోనని ప్రశ్నించారు. సమావేశంలో పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, నందికొట్కూరు మండల క్లస్టర్ ఇంచార్జ్ పల్లె రఘురామిరెడ్డి, టిడిపి మైనార్టీ నాయకులు షకీల్, లీగల్ సెల్ నాయకులు జాకీర్, ఐ టీడీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ మూర్తుజావలి, నెహ్రూ నగర్ నాగరాజు, ఎస్సీ సెల్ నాయకులు సురేష్ తెలుగు యువత నాయకులు మధు, గణపురం చంద్రేష్, రవికుమార్, అల్లూరు పాల బాబులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిలో రాయలసీమ పట్ల వివక్ష ఇంకా ఎన్నాళ్ళు..?

విశాలాంధ్ర - నంద్యాల : రాయలసీమ సాగునీటి హక్కుల అమలు సాధనకై ప్రజలంతా సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో ప్రజలకు బహిరంగ లేఖను ఆదివారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల అవసరాలను తీర్చడంలో పాలకులు ఎల్లప్పుడూ యదావిధిగా ప్రత్యేక శ్రద్ధ కనవరస్తూనే ఉన్నారని, అందుకు ప్రస్తుత ఉదాహరణ మృగశిర కార్తి వచ్చీ రాగానే జల వనరుల శాఖ మంత్రి జూన్ 7, 2023 కృష్ణా డెల్టాకు నీళ్ళు విడుదల చేయడమే నిదర్శనమన్నారు. కృష్ణా డెల్టా అవసరాలను తీర్చడానికి ప్రకాశం బ్యారేజి, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు కాకుండా నాలుగవ స్థిరీకరణ ప్రాజెక్టుగా పులిచింతల రిజర్వాయర్, ఐదవ స్థిరీకరణ ప్రాజెక్టు గా పట్టిసీమ, ఆరవ స్థిరీకరణ ప్రాజెక్టుగా పోలవరం సాధించుకున్నారు అక్కడి ప్రజా ప్రతినిధులు. కాని రాయలసీమ ప్రాజెక్టుల స్థిరీకరణకు గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తిపోతల పథకాలు కోసం గొంతెత్తకపోగా, శ్రీశైలం కాళీ చేస్తున్నా మన ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం బాధాకరంగా ఉందన్నారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు శ్రీశైలం రిజర్వాయర్ లో 854 అడుగులకు నీరు చేరేంత వరకు దిగువకు నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేయకుండా పాలకులపై ఒత్తిడి పెంచడానికి, రాయలసీమ సాగునీటి నిర్మాణాలపై పాలకులపై ఒత్తిడి తేవడానికి రాయలసీమ ప్రజానీకం సంఘటితమై గళం విప్పాలని దశరథరామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

31న బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : నంద్యాల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభల సందర్భంగా ఈనెల 31వ తేదీ పట్టణంలోని గౌడ్ సెంటర్లో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయా లని జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ ఆఫీసులో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాతపట్టణంలో జరుగు వ్యవసాయ కార్మిక సంఘం మొదటి మహాసభలను జయప్రదం చేయాలని సంఘం శ్రేణుల కు ఆయన పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుకె.శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టి ప్రతాప్, పాములపాడు మండల అధ్యక్షుడు చిలుక ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేసున్ని దర్శించుకున్న మాజీ ఎంపీ గంగుల

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిల లక్ష్మీ నరసింహ స్వామిని మాజీ రాజ్యసభ సభ్యులు గంగుల ప్రతాప్ రెడ్డి దర్శించు కున్నారు. ప్రతాప్ రెడ్డి అహోబిలం రాగానే ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన దిగువ, ఎగువ అహోబిల ఆలయాలలో స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగుల 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈయన వెంట కేడిసిసి బ్యాంకు డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నకిలీ సంతకాలతో తీర్మానం జరిగినట్లు సర్పంచ్ ఆరోపణ

విశాలాంధ్ర - అవుకు : మండలంలోని కాశీపురం గ్రామపంచాయతీలో నకిలీ సత్తకాలు సృష్టించి సభ తీర్మానం జరిగినట్లు అధికారులకు నివేదికలు పంపి సీనియర్ మీటిగా నియమించటం ఏమిటని గ్రామ సర్పంచ్ మోట్ల లావణ్య తెలిపారు. ఆదివారం ఆమె చరవాణిలో మాట్లాడుతూ కాశీపురం గ్రామానికి చెందిన బాల రామ గోవిందు అనే వ్యక్తి గతంలో చనుగొండ్ల గ్రామపంచాయతీ క్షేత్రసహాయకుడిగా పనిచేసేవాడని ఆ సమయంలో అతను మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో సరైన పనులు చేపించకపో వడంతో ప్రభుత్వము అతనిని తొలగించడం జరిగిం దని తెలిపారు. కాశిపురం గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పడడంతో ఇక్కడ ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ స్థానాన్ని భర్తీ చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి పంచాయతీ సెక్రెటరీ యొక్క సంతకాన్ని ఫోర్జరీ చేసి గ్రామసభ తీర్మానం లేకుండానే తీర్మానం జరిగినట్లు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ రాము గోవిందును మరల కాశిపురం గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గా ఎలా నియమిస్తారు అని సర్పంచ్ ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని గ్రామ సర్పంచ్ మోట్ల లావణ్య తెలిపారు. సర్పంచుకు గాని పంచాయతీ సెక్రటరీ గాని ఈ విషయం ఏ మాత్రం తెలియదని తెలిపారు.

"నాన్న నన్ను క్షమించు" పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - బనగానపల్లి : బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి రచించిన "నాన్న నన్ను క్షమించు" అనే పుస్తకాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విద్యావేత్తలు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజల మధ్య ఆవిష్కరించారు. రచయిత బిసి రాజారెడ్డితో పాటు కళా సృజన రత్న, ప్రముఖ వ్యాఖ్యాత ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా, కర్నూలు లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రముఖ గజల్ గాయకుడు మహమ్మద్ మియా, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పకీర రెడ్డి ముఖ్య అధ్యక్షులు హాజరయ్యారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ నానాటికి నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులు పడే ఆవేదన నుంచి పుట్టినది ఈ నాన్న నన్ను క్షమించు రచయిత బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు నాయక్, శంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రామసుబ్బయ్య, వెంకట్రాంరెడ్డి,వెంకటరెడ్డి, ఇస్మాయిల్, టిడిపి నాయకులు టంగుటూరి శ్రీనయ్య, జ్యోతిస్కులు వెంకట్రాముడు, పాల్గొన్నారు.

మట్టి మిద్దె కూలి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పాత మట్టి మిద్దెకు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవాశాత్ మిద్దె కూలిపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉమ్మాయిపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్యా నాయక్(59)మట్టిమిద్దే కూలిపోయి తీవ్ర గాయాలతో మృతి వాతపడ్డాడు.చంధ్యా నాయక్ తాను నివాసం ఉంటున్న మిద్దె దంతేలు పాత పడటంతో వాటిని తొలగించి, కొత్త వాటిని అమర్చుతుండగా ప్రమాదవశాత్తు మిద్దె కూలిపోయింది. మట్టి రాళ్లలో కూరుకుపోయి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతని తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సేవ్ ఇండియా సేవ్ గవర్నమెంట్ సెక్టర్, మోడీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో ఆగస్టు 9న విజయవాడలో జరుగు మహాధర్నా జయప్రదం చేయాలని నంద్యాల సీపీఐ కార్యాలయంలో ఏఐటీయుసి నాయకుల సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సమావేశం నంద్యాల పట్టణ అధ్యక్షులు భూమిని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి శివ బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కే ప్రసాద్, పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి కార్మిక చట్టాలు మార్పు చేసి కార్మిక హక్కుల కాలరాస్తుందని ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకి జాతీయ సంపదను అమ్ముతుందని కార్పొరేట్ శక్తులకి కార్మికుల కడుపు కొడుతుందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలు కార్మికుల అశేష త్యాగాల ద్వారా సాధించుకున్న పాత చట్టాలనే అమలు చేయాలని, నాలుగు లేబర్ కోర్లు రద్దు చేయాలి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వమే ప్రభుత్వ రంగంలోనే నడపాలని వారు డిమాండ్ చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులనురెగ్యులర్ చేయడంలో,అవుట్సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంను, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనయని వారు విమర్శించారు. బాలకృష్ణ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఉన్న హమాలి,ఆటో, వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికులకు జాతీయ సమగ్ర సంక్షేమ చట్టాన్ని వారు డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలను తగ్గించి, డీజిల్ పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, బకాయిపడిన డిఏచెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలని ఈ కోరికల సాధనకు కేంద్ర కార్మిక సంఘాల తలపెట్టిన క్విట్ ఇండియా ఉద్యమ రోజైనటువంటి మహా ధర్నాను వేలాదిమంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోటయ్య, మద్దయ్య, ప్రతాప్, సుశీలమ్మ, తులసమ్మ,ప్రసాద్, రమేష్, సుబ్బరాయుడు, ఆనంద్, హుస్సేని, అబ్దుల్ కలాం,ఈశ్వరమ్మ, సుబ్బమ్మ, మేరి, పెంచలమ్మ, సుబ్బమ్మ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఉద్యమాలకు సిద్ధం కావాలి



విశాలాంధ్ర - ప్యాపిలి : ఉద్యోగం,ఉపాధి అవకాశాల కోసం నిరుద్యోగులందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణాత్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి సూర్య ప్రతాప్ పిలుపునివ్వడం జరిగింది. ఆదివారం స్థానిక ఎస్టియు కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులతో సమావేశం నిర్వహించారు.మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగం ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అదేవిధంగా ఆత్మహత్యలు చేసుకుంటు న్నారని దీని అంతటికి కారణం ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అని రాష్ట్రంలో నూతన పరిశ్రమలు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల 60వేల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని, జిల్లాకు ఒక పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని, విద్యార్థులు ఉద్యోగాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా శివకేశవులు కో కన్వీనర్‌గా శివప్రసాదను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రంగస్వామి, మనోజ్, శివకిషోర్, వంశీ చంద్రనాయక్, లక్ష్మీనారాయణ, బంగారప్పా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరి మధు పై దాడిని ఖండించండి

విశాలాంధ్ర - నంద్యాల : మహానంది మండల కేంద్రంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి కవరేజ్‌కి వెళ్ళిన మండల వార్త విలేఖరి మధుపై స్థానిక ఎమ్మెల్యే శిల్ప చక్రపాణిరెడ్డి,పోలీస్ అధికారుల సమక్షంలో అధికారంలో ఉన్నామనే బలుపుతో తిమ్మాపురం వైసీపీ నాయకుడు వీరారెడ్డి తన అనుచరులతో దాడి చేయడం అమానుషమని, వెంటనే పోలీస్ అధికారులు దాడికి పాల్పడిన వీరారెడ్డి, వారి అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాపకృద్దీన్ డిమాండ్ చేశారు.మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పని చేస్తున్న పత్రిక విలేకరులు ప్రజా సమస్యలపై ఉన్నది ఉన్నట్టు వాస్తవాలు రాయడం వల్ల ప్రజాసమస్యలు పరిష్కరించే దిశలో ఉంటాయని, మహానంది మండలంలో భూ బకాసురులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉండడం ప్రభుత్వ భూములన్ని కబ్జాలు చేయడం పరిపాటి అయిందని, రెవెన్యూ, ప్రభుత్వాధికారులు ఎవరొచ్చినా వారిని డబ్బుల ద్వారా లొంగదీసుకొని వారి పేర్ల మీద ఆ పొలాలు అడంగల్ ఆన్లైన్ చేపించుకోవడం జరుగుతున్నా ఎవరు పట్టించుకోకపోవడంతో భూబకాసురులు కోటీశ్వరులవుతున్నారని ఆరోపించారు. గతంలో రెవిన్యూ అధికారుల అవినీతి వల్ల వందల ఎకరాలలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగినప్పుడు సిపిఐ ఆధ్వర్యంలో భూ సమస్యపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడం జరిగిందని వెంటనే పోలీసు అధికారులు వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 17, జూలై 2023

సాధికార సమితి రాష్ట్ర సభ్యులుగా హనుమంతరావు

విశాలాంధ్ర - కర్నూల్ సిటీ : టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులుగా కర్నూలు జిల్లా వాసి సముద్రాల హనుమంతరావుని పార్టీ అధిష్టానం నియమించింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకం ఉంచి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యునిగా నియమించడం సంతోషంగా ఉందని సముద్రాల హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర కమిటీకి ఎన్నిక అయ్యేందుకు సహకరించిన కర్నూల్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టీజీ భరత్, జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో బాధ్యత పెరిగిందని, 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపులకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

20 కుటుంబాల ప్రజలు సీపీఐలో చేరిక

విశాలాంధ్ర - కర్నూల్ : కర్నూల్ నగరంలోని 17వ వార్డులో భాగమైన నట్టు ఇందిరమ్మ కాలనీ వాసులు దాదాపుగా 20ముస్లిం మైనార్టీ కుటుంబాలు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి సమక్షంలో సిపిఐలో చేరడం జరిగింది. మైనార్టీస్ అంతా వారి అభివృద్ధి కోసం పాటు పడే పార్టీలు ఈ దేశంలో ఏవైనా ఉన్నాయా అంటే అవి కమ్యూనిస్టు పార్టీలే కాబట్టి మేము అందరం కూడా మా రక్షణ కోసం మా కుటుంబాల అభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరిస్తామని వారు స్వతగా పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించడం జరిగింది. వారిని ఉద్దేశించి సీపీఐ నగర కార్య దర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద పార్టీ అధికారంలో ఉండడంతో ఈనాడు దేశంలోని ప్రజలందరూ భయభ్రాంతులకు గురవుతూ ఏరోజు ఏ మతం పైన ఏకులం పైనదాడి చేస్తుందో వారి హక్కుల హరించే విధంగా చట్టాలు చేస్తుందో భయాందోళనగా ఉన్నదని కావున ఈ కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలంటే 2024లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలంతా ఏకమై బిజెపిని గద్దె దింపాలని దాని కోసం కమ్యూనిస్టు పార్టీలు చేసే పోరాటాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని ప్రస్తుతం దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్నటువంటి నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందాయని కమ్యూనిస్టు పార్టీలు చేసే పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలనిపిలిపించారు. పార్టీలో చేరిన కుటుంబాలను పార్టీలోకి సాధారణంగా వారిని ఆహ్వానించి మహిళ సభ్యులం దరికీ మహిళా సమైక్య సభ్యత్వం ఇవ్వడం జరిగింది. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఏం.బీసన్న,నగర సమితి సభ్యులు బాబయ్య,మౌలాలి,కాసివమ్, బాబ్జి,రాజశేఖర్ పార్టీ తరపున పాల్గొన్నారు. అనంతరం నూతన శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. శాఖ కార్యదర్శిగా కాజాబాషా,సహాయ కార్య దర్శిగా కరిమున్ని, కమిటీ మెంబర్స్‌గా 21 మందిని ఎన్నుకోవడం జరిగింది.

టిడిపి ఇంటిగ్రేట్ శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - వెల్దుర్తి : పత్తికొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు, జాతీయ పార్టీ తెలుగు దేశం ఆదేశాల మేరకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం పోల్ మేనేజ్మెంట్, ఆర్టిఎస్, మన టిడిపి సంబంధించి ఓటర్ వెరిఫికేషన్ వెల్దుర్తి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ టి బలరాం ఆధ్వర్యంలో మండల క్లస్టర్ యూనిట్, బూత్ స్థాయి నాయకులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. కార్యక్రమంలో ఏసి ట్రైనింగ్ ట్రైనర్ మంచిరెడ్డి, శశి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరిగినది ఈ మీటింగ్‌కు మండల అధ్యక్షుడు బలరాం గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.

మంత్రాలయం టు కర్నూలుకు రైల్వే లైన్ ఏర్పాటుకై పోరాటాలకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు :మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజవర్గాల చిరికాల స్వప్నం రాజోలి బండ డైవర్ట్ స్కీమ్ కుడికాలువ నిర్మాణం పూర్తి చేయడంలో పాలక ప్రభుత్వాలు రెండు నియోజకవర్గాల ప్రజలను మోసం చేయడం జరుగుతుందని,కాబట్టి ఈప్రాంతాలలో కరువును పారదొరలాలంటే ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి వలసలు నివారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణం తేరు బజార్ నందు ఉన్న మినీ ఫంక్షన్ నందు ఎమ్మిగనూర్, మంత్రాలయం నియోజకవర్గల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి సీపీఐ ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి జి.రంగన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4సంవత్సరాలు పూర్తయినప్పటికీ కర్నూలు జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు పూర్తికై నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం జరిగిందని, కర్నూలు జిల్లాలో ప్రధానంగా పశ్చిమ ప్రాంతం కరువులకు రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వం హయాంలో మంత్రాలయం టు కర్నూల్‌కు రైల్వే లైన్ సర్వేలు పూర్తయినప్పటికీ , రైల్వే లైన్ కలగానే మిగిలిందని, ఇప్పుడున్న అధికార పార్టీ పార్లమెంట్ సభ్యుడు పార్లమెంటు సమావేశాలలో ప్రస్తావించలేకపోవడం దారుణమని, ఇప్పటికైనా పార్లమెంట్ సభ్యుడు రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసి, మంత్రాలయం టు కర్నూల్ రైల్వే లైన్ వేసే విధంగా చొరవ చూపాలని ఆయన తెలిపారు. ఎమ్మిగనూరు నియోజవర్గంలో చేనేత కార్మికులను ఆదుకోవడానికి తక్షణమే టెక్స్టైల్ పార్కును మరియు ఎమ్మిగనూరు పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుపై సీపీఐ దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ, నియంత పాలన కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతూ కులాల పేరుతో ప్రజలను విడదీస్తుందని కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికలలో ప్రజల గుణపాఠం చెప్పాలని ఆయన తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా ఉన్న తోళ్ల పరిశ్రమ మూతపడడంతో దాదాపు 200 మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాబట్టి తక్షణమే తోళ్ల పరిశ్రమ పునర్ ప్రారంభించాలని ఆయన తెలిపారు.మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజవర్గాల అభివృద్ధికై దశలవారీగా పోరాటాలకు సీపీఐ శ్రేణులుసంసిద్ధంకావాలని వారు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్,భాస్కర్ యాదవ్,నందవరం గోనెగండ్ల,ఎమ్మిగనూరు, పెద్దకడబూరు,కోసిగి, మంత్రాలయం, మండల కార్యదర్శి చిన్ననన్న, నాగప్ప,వీరేష్,గిడ్డయ్య, గోపాల్,నాయక్, సీపీఐ నాయకులు బజారి,కెసిజబ్బర్,దాదావలి,తిమ్మాగురుడు,విజయేంద్ర, కాజా ,మల్లికార్జునగౌడ్,బాలు,నరసింహులు,వీరేష్,సుంకన్న,లక్ష్మన్న,మునిస్వామి,రమేష్, ఖాదర్,శాంతప్ప,జంపన్న, తదితరులు పాల్గొన్నారు.

దారేపోగు ప్రకాష్ పిహెచ్‌డి పట్టా

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : రాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కళాశాల ఏ.క్యాంప్ కర్నూలు నగరంలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న దారేపోగు ప్రకాష్ రాయలసీమ యూని వర్సిటీ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు పర్యవేక్షణలో కవి, సామాజిక, రచయిత, పద్మశ్రీ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయినటువంటి ఆచార్య కొలకల్లూరి ఇనాక్ కవిత్వం సామాజిక చైతన్యం అనే అంశంపై పిహెచ్‌డి పట్టా పొందారు. రాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆదిమూల సతీష్ మరియు తోటి కళాశాల సిబ్బంది అభినందించారు.

విజయవనం అభివృద్ధికి ఆకర్షణీయంగా డిజైన్‌లు రూపొందించండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : విజయవనం అభివృద్ధి కోసం ఆకర్షణీయంగా డిజైన్‌లు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు.కర్నూలు నగర శివారులో ఉన్న విజయవనంను అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో మున్సిపల్ కమీషనర్ భార్గవ తేజ, డిఎఫ్‌ఓ శివ శంకర్ రెడ్డి,ఆర్కిటెక్ట్ తో కలిసి ఆదివారం విజయ వనాన్ని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి సూచనల మేరకు కర్నూలు నగర శివారులో ఉన్న విజయవనం అభివృద్ధి కోసం 10కోట్ల రూపాయలతో పర్యాటక పరంగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.. అందుకనుగుణంగా యోగా సెంటర్, యాంఫి థియేటర్ ను అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసేందుకు డిజైన్‌లను రూపొందించాలని ఆర్కిటెక్ట్‌కు జిల్లా కలెక్టర్ సూచించారు. అదే విధంగా హైదరాబాద్‌లో ఉన్న పాలపిట్ట సైక్లింగ్ పార్కు, బటర్ ఫ్లై గార్డెన్, మొఘల్ గార్డెన్ తరహాలో సైక్లింగ్ పాత్, వాకింగ్ పాత్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కు సుందరీకరణ పనులు వేగంగా జరిగేందుకు గాను సొసైటీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డిఎఫ్‌ఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఫుడ్ కోర్టు కూడా వనం బయటనే ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. విజయవనం (పుల్లయ్య పార్కు)ను జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమీషనర్, డిఎఫ్‌ఓలతో కలిసి పరిశీలించారు. అనంతరం వెంగన్నబావి సమీపంలో ఉన్న దేవాలయాన్ని కూడా పరిశీలించి ఆ ప్రాంతాన్ని కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్కిటెక్ట్ జి.శ్రీనివాస మూర్తి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : మండల పరిధిలోని కప్పట్రాల గ్రామంలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించిన కప్పట్రాళ్లకి చెందిన చింతమను రవికుమార్, భవానిలా ద్వితీయ కుమారుడు జశ్వంత్ కుమార్ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన సందర్భంగా దేవనకొండ మండల వైయస్సార్సీపి మండల కన్వీనర్ కప్పట్రాల మల్లికార్జున గారు విద్యార్థిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా గ్రామంలో ప్రతి సంవత్సరం 10వ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన వంటి విద్యార్థులకు మరియు గ్రామంలో ఉద్యోగాలు సంపాదించినటువంటి యువతీ, యువకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారుచదువుతున్న పిల్లలకు మరియు ఉద్యోగాలు తెచ్చుకున్న యువతకు ప్రోత్సాహకరంగా సన్మానించాలని గ్రామ రైతులందరూ కలిసి నిర్ణయం తీసుకోవడం జరిగింది. గత జిల్లా ఎస్పీ ఆకే రవి కృష్ణ గారి ఆశయాల ముందుకు తీసుకెళ్లే విధంగా మేము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. మా గ్రామం అభివృద్ధి బాటలో నడచాలంటే కేవలం యువత వలన సాధ్యమవుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతమను రవికుమార్, చాకలి లక్ష్మన్న, మహాలింగడు, మునుస్వామి,మహాలింగడు, తిప్పన్న, లింగన్న, రాజశేర్, రంజాన్,వారం వెంకట రమణయ్య, ఉరుకుందు గౌడు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ రైతులతో సమావేశం



విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామంలో సమావేశానికి ముఖ్యఅతిథిగా సే ట్రీస్ సంస్థ రీజినల్ మేనేజర్ సి.మనోహర్ హాజరై రైతులకు బహుళ అంతస్తు పండ్ల తోటల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం రైతులు ఒకే రకమైన పండ్ల తోటలు పెట్టడం ద్వారా లాభాలు అర్జిం చడం లేదు. ఈ కారణం చేత మేము రైతులతో మాట్లాడి గ్రామంలో ఐదు రకాల పండ్ల మొక్కల తో బహుళ అంతస్తు పండ్ల తోటలను ప్రోత్సహిస్తున్నాము. ముఖ్యంగా మామిడి, చీని వేసుకునే రైతులకు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని తెలియజేశారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కువగా పశు అసంపద ఉన్న రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించడానికి బయోగ్యాస్ యూనిట్స్‌ని పెట్టి వాటి ద్వారా వచ్చే స్లరిని ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో ఉపయోగించడానికి అనుగుణంగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలియజేశారు. ప్రోగ్రామ్ మేనేజర్ బి నారాయణ, కప్పట్రాళ్ల మల్లికార్జున రిసోర్స్ పర్సన్ చింతమన రవికుమార్, చింతమాను మహాలింగడు.శివశంకర్ .చాకలి లక్ష్మన్న, శివలింగడు ఉరుకుంద గౌడ్, వారం రమణయ్య రైతులు పాల్గొన్నారు.

అందరి దీవెనతోనే 2024లో జగనే సిఎం

విశాలాంధ్ర-కోసిగి : సిఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి గడపలోని అవ్వతాతలు, అక్కాచెల్లె మ్మలు, అందరి దీవెనతోనే 2024 లో మళ్ళీ సియం జగనన్న కావడం ఖాయమని మంత్రాలయం నియోజకవర్గ హ్యాట్రిక్ ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఆదివారం మండల పరిధిలోని కందుకూరు గ్రామ సచివాలయం నందు కందుకూరు,కడిదొడ్డి గ్రామ పంచాయతీల్లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు మండల ఇంచార్జీ మురళీ మోహన్ రెడ్డితో పాటు కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు.ప్రతి గడపకు వెళ్లి వాలింటర్ల వ్యవస్థ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును స్వయంగా అడిగి తెలుసుకుంటూ, అనర్హులకు పథకాలు అందించేందుకు అందుకు గల సత్వర పరిష్కార చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. యస్ఐ సతీష్ కుమార్, యంపీపీ ఈరన్న, నాడిగే ని నరసింహులు,బెట్టనగౌడ్ మహాంతేష్ స్వామి,శ్రీనివాస రెడ్డి,నాడిగేని నాగరాజు, నరసింహులు గౌడ్,ఏఈ వీరేష్,ఏపీయం సత్యమ్మ, ఏపీఓ జయరాం,కడిదొడ్డి సర్పంచ్ ఉసేని,కాల్వ లక్ష్మయ్య,తిక్కయ్య, యంపీటీసి మల్లయ్య, అగసనూరు, తుమ్మిగనూరు సర్పంచ్లు ఉలిగయ్య,ఈరన్న, రమేష్,ఆకాష్ రెడ్డి,పరుశురాం పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర - ఆస్పరి : జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదని టిడిపి నాయకులు సతీష్ కుమార్, తెలుగు యువత తాలూకా నాయకులు యాగంటి మహేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్కులో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు వీరేష్ అధ్యక్షతన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క చాన్స్ ఇవ్వాలని అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అన్ని సామాజిక వర్గాల ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తు న్నారని మండిపడ్డారు. గ్రామాల్లో సమస్యలు నెలకొన్నా వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామ సర్పంచుల నిధులను జగన్ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శిం చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. గతంలో తమ ప్రభుత్వం నిధులు కేటాయించి అన్ని వర్గాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు తోడ్పాటును అందించాన్నారు. నిత్యావసరాల ధరలతో పాటు పన్నులు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలను భారీగా పెంచి జనంపై పెనుభారం మోపుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని జోష్యం చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు పూజారి మహేష్, మహానంది, బాలు, షారుక్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని వేద ఫిజియో వైద్యశాల నందు ఆదివారం ఏవీస్ హాస్పిటల్ హైదరాబాద్ వారు వెరీ కోస్ వేయిన్స్ సమస్యలకు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రామ గోపాల్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ గణేష్, శ్రీనివాస్, స్వర్ణలత మరియు డాక్టర్ నరేంద్ర దేవ్, డాక్టర్ సుబ్బ నరసయ్య, డాక్టర్ మల్లికార్జున గుప్తా పాల్గొని రోగులకు తగిన సలహాలు, చికిత్స పద్ధతులు , పరిష్కార మార్గాలు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు శ్రీనాథ్ శర్మ, ఖలీల్ అహ్మద్, సుబ్బారావు మరియు సుధాకర్ రావు, మైత్రేయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను ఉల్లంగిస్తే చర్యలు

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలను కచ్చితంగా పాటించాలని ఎస్సై శివ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో ట్రాఫిక్ పై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. షాపులు,దుకాణాల ఎదురుగా వాహనాలు, మోటార్ బైక్ లు తొలగిస్తూ,వాహన దారులు, దుకాణాల యజమానులకు తగు సూచనలు,సలహాలు ఇచ్చారు.వాహనాలు పెట్టేటప్పుడు దుకాణాల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, లేని పక్షంలో దుకాణాల యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై లింగమయ్య,కానిస్టేబుల్స్ మహేష్, నాగ మహేష్,లక్ష్మీ నారాయణ,రామిరెడ్డి,అశోక్,నాగ మద్దయ్య,తదితరులు పాల్గొన్నారు.

స్నేహం విలువ ఎంతో గొప్పది

విశాలాంధ్ర - కోడుమూరు : 36 ఏళ్లయినా మిత్రులందరూ ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని,మన స్నేహం విలువ ఎంతో గొప్పదని జడ్పిటిసి రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కోట్ల హర్ష కార్యాలయం వద్ద 1986- 87వ సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థి మండల విద్యాధికారిగా పదోన్నతి పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని కొలిమిగుండ్ల ఎంఈఓ రెడ్డి అబ్దుల్ కలాంను ఘనంగా సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తోటి మిత్రులు జడ్పిటిసి రఘునాథరెడ్డి, పత్తికొండ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఏ రఘురామిరెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తోటి మిత్రులందరూ సాటి మిత్రులు ఎవరైనా ఎదురైనప్పుడు ఆప్యాయత, అనురాగాలతో పలకరించుకోవాలన్నారు.మనందరం ఒకరికొకరు పరస్పర సహకారంతో ఆనందంగా జీవిద్దామని ఆకాంక్షించారు. జీవించి ఉన్నంత కాలం అందరము నవ్వుతూ,ఇలాగే కలకాలం కలిసి ఉందామని అభిప్రాయపడ్డారు. మనలో ఎవరైనా మిత్రులు సమస్యలకు గురైతే వీలైనంత వరకు మనకు తోచిన విధంగా వారిని ఆదుకుందామని చెప్పారు.జీవించి ఉన్నంత వరకు ఆరోగ్యంగా ఉంటూ,ఎన్ని సమస్యలు ఎదురైనా చిరునవ్వుతో వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం 1987వ బ్యాచ్ విద్యార్థులందరూ ఎంఈఓగా పదోన్నతి పొందిన రెడ్డి అబ్దుల్ కలాంను దుశ్శాలువలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.పూర్వ విద్యార్థులు ముగితి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తిప్పయ్య,టీచర్ దేవదాస్, సి రామకృష్ణ,జిశశిధరరెడ్డి,మిరపకాయల నాగరాజ్,జి వెంకటేశ్వర్లు, కొండ సత్యం, విజయ్,ఎస్ సతీష్ కుమార్,కరెంట్ మల్లారెడ్డి, నేసే శంకర్,దాసుకృష్ణ,ఎస్సై నాగేష్,టీచర్ జాన్ తిక్కన్న,శ్రీనివాసనాయుడు,ఎస్సై సతీష్,బందా గోపాల్, ఎస్సై చంద్రశేఖర్, బాలమురళీ కృష్ణ,చిన్న గోకారి,అబ్దుల్ ఖాదర్, విజయ్,యల్లప్ప,బి నాగరాజు, వెంకటేశ్వరప్ప, గౌస్,గోట్లనాగరాజు,గోపాల్, రమణమూర్తి, శ్రీరాములు, బి.నాగరాజు, పెద్దారెడ్డి, శ్రీధర్,పాల్గొన్నారు.

జిల్లాకు పదివేల కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆస్పరి : రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాకు రూ.10 వేల కోట్లను కేటాయించాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జీపు జాతను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆస్పరి మండలానికి వందికోన రిజర్వాయర్ నుండి సాగు, తాగునీరు అందించాలని, హంద్రీనీవా ద్వారా 106 చెరువులు నింపాలి, వేదవతి ప్రాజెక్టు కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మండలంలో రెండు రోజులపాటు జరిగే జీపు జాత కార్యక్రమంలో రైతులు, కూలీలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొదటిరోజు జొహరాపురం, శంకరబండ, చిరుమాన్ దొడ్డి, హలిగేర, బిణిగెరి, చిగిలి, నగురూరు. తంగారదోన. తురువగల్లు. తొగలగళ్ళు, యాటకల్ల, కల్లపరి, కైరుప్పల గ్రామాల్లో జీపు జాతను నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల నాయకులు బాలకృష్ణ, రంగస్వామి. పార్టీ సీనియర్ నాయకులు రామాంజనేయులు, రంగప్ప. మాణిక్యప్ప. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, రామకృష్ణ మహానంది బలరాం, తిప్పన్న, ఈరన్న, ప్రకాష్. ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేడుకలకు ఉపాధ్యాయులు సిద్ధం కండి

విశాలాంధ్ర - కర్నూలు : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూలు జిల్లాలోని ఉపాధ్యాయులు వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం కావాలని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్ హెచ్. తిమ్మన్న లు పిలుపునిచ్చారు. ఈ మేరకు తేదీ ఆదివారం సలాం ఖాన్ ఎస్ టి యు భవనంలో రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ సాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ .తిమ్మన్న, రాష్ట్ర సహాధ్యక్షులు గంటా మోహన్,(చిత్తూరు)చంద్రశేఖర్,(నంద్యాల) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు సి నాగరాజు,(కర్నూలు) చంద్రశేఖర్,(అనంతపురం) రాష్ట్ర కార్యదర్శులు బి. ప్రసన్నరాజు (కర్నూలు) మహమ్మద్ ఇక్బాల్ బాషా (నంద్యాల) ఇ.వి.గోపాలకృష్ణ (నంద్యాల) రాయలసీమ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి, టికె జనార్దన్, అజాం బెగ్, డి చిన్న మౌలాలి, వి. రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, జి .సూర్యుడు, రమణారెడ్డి, రామాంజనేయులు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 1946 జూన్ 9వ తేదీన ఆనాటి హైదరాబాద్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యోగుల ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు ఆవిర్భవించి నేటి వరకు ఉద్యమాల ఊపిరిగా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నదని, అలాంటి సంఘంలో సభ్యులుగా ఉండడం మనకందరికీ గర్వకారణం అని తెలియజేశారు. ఇప్పటికే 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల విద్యార్థుల సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వజ్రోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా అత్యంత ఘనంగా కర్నూలు నగరంలో జరపడానికి రాష్ట్ర సంఘం తీర్మానించిందని, ఆ మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధ్యాయులు అదేవిధంగా కడప అనంతపురం జిల్లాల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి వజ్రోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏ మేరకు వజ్రోత్సవాలకు సంబంధించి ప్రాథమిక సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని రాబోయే రోజుల్లో ఆహ్వాన సంఘం ఇక్కడి నుంచి ప్రకటించి వేడుకలను లాంచనంగా ప్రారంభిస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వజ్రోత్సవ వేడుకలు ఒక దిక్సూచిలా పనిచేస్తాయని, కర్నూలు జిల్లాలో సంఘం బలంగా ఉందని నాయకత్వం క్యాడర్ బలంగా ఉన్నందువలన వజ్రోత్సవ ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేపట్టాలని ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు ఇప్పటినుంచే ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ ప్రభుత్వం జీవో నెంబర్ 117 పేరుతో 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం వల్ల ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో వదిలేసి ప్రైవేటు పాఠశాలల్లో చేరడం జరిగిందని ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు కనుమరుగై గ్రామ గ్రామాన ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి పేద విద్యార్థులకు చదువు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు, అదేవిధంగా మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు ఆమోదించాలని, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు 010 హెడ్ జీతాలు పదోన్నతులు బదిలీలు కల్పించాలని, కస్తూర్బా ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఇద్దరు మండల విద్యాధికారుల మధ్య అధికార విధులు సమానంగా విభజించాలని, పెండింగ్ ఉన్నటువంటి 11వ పిఆర్సి బకాయిలు, కరువు బత్యం బకాయిలు, సంపాదిత సెలవు నగదీకరణ బిల్లుల చెల్లింపు, తక్షణం చెల్లించాలని అదేవిధంగా 12వ పిఆర్సి కమిషన్ తక్షణమే 50% మధ్యంతర భృతితో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా ఎస్టియు నాయకులు జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు, ఈ. సుధాకర్ గౌడ్, మహమ్మద్ షఫీ, జి నాగరాజు, బి వెంకటేశ్వర్లు, శేఖర్, వెంకట్ రాముడు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి పాము కాటు

విశాలాంధ్ర - గోనెగండ్ల : గోనెగండ్ల మండల పరిధిలోని బైలుప్పలలో గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఒకే కుటుంబలో ముగ్గురు వ్యక్తులకు పాము కరిచింది. పాముకాటుకు శ్రీనివాసులు (10)అనే బాలుడు మృతి చెందాడు. దొరస్వామి వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మరో ఎనిమిది నెలల బాలుడుని కరిచింది.అయితే ఎనిమిది నెలల బాలుడు కి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.దొరస్వామి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఎనిమిది నెలల బాలుడు క్షేమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురిని పాము కాటు వేయడం, అందులో ఒకరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లార్తిలో మద్యానికి బానిసుడై కటికే కాసిం (30) ఆదివారం గ్రామ సమీపంలోని చెరువు వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని మరణించినాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ నాయక్ తెలిపారు. భార్య కటికే దిల్షాద్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. పోస్టుమార్టం కోసం శవాన్ని ఆలూరు ఆసుపత్రికి తరలించామని అన్నారు.